కథా నిలయం
6748
KB2-3
శ్రీకాకుళం

# 1. కిటికీ తెరిస్తే...

స్వభావరీత్యా మాధవి మంచిపిల్ల.

ఇప్పటి పరిస్థితి వేరు. శూన్యంలోకి చూస్తూ, చేతులాడిస్తూ గాల్లో చాలా ముగ్గులేస్తోంది. చక్రాల్లాంటి కళ్ళు ఆ యింటి చాలా కోణాల్నీ, పార్శ్వాల్నీ కొలుస్తున్నై.

మాధవి తల్లి హేమలత, కూతుర్ని చూస్తోంది. కూతురి చేష్టల్ని చూస్తోంది. నీళ్ళు నిండిన కళ్ళతో చాలాసేపటి నుంచీ గమనిస్తూనే వుంది. కూతుర్ని ఈ స్థితిలో చూస్తున్నకొద్దీ ఆమెకి బాధ ఎక్కువౌతోంది. ఆ పిచ్చిపిల్ల పట్ల ఈ పిచ్చి తల్లికి జాలి. అది మనసులో సుడిరేపి, కదలి, సాగి, గుండెల్ని ఆర్ద్రం చేస్తోంది. తలచుకున్న కొద్దీ ఈమె వొళ్ళు ఆవిర్లు తేలుతోంది.

"అసలీ పిల్లని ఎమ్సెట్టూ, ట్రిపుల్ ఏఅయ్యీ, ఐఐటీ కోచింగ్‌లో చేర్పించకుండా వుండాల్సింది."

మళ్ళీ అనుకుంది. పశ్చాత్తాపం! పశ్చాత్తాపం మిగిల్చిన వేదన. మాధవి పూర్తిగా గాడి తప్పిందనే క్షోభ.

నెల రోజుల్నుంచీ ఇదే వరస.

హాల్లోకి వచ్చి కూర్చోదు. ఎవరితోనూ మాట్లాడదు. నవ్వితే వెకిలినవ్వు. అడిగిన ప్రశ్నలకు 'ఆఁ, ఉఁహూఁ'లే సమాధానాలు. కంప్యూటర్‌ని ఆన్ చేయటంలేదు. టీవీ చూడటం లేదు. ఉంటే తన గదిలో. లేకపోతే టెర్రస్ మీద గంటల తరబడి పచార్లు చేస్తూ వుంటుంది. కాలేజీకి వెళ్ళినరోజు వెళ్తుంది. వెళ్ళని రోజున 'క్లాసుల్లేవులే' అని తప్పించుకుపోతుంది. వెళ్ళిన రోజునైనా ఏ రెండింటికో తిరిగొచ్చేస్తుంది.

భర్త సురేశ్‌కి చెప్పి చూసింది హేమలత. ముందు భర్తగా ఆమె మీదే ఎగిరాడు. తండ్రిగా – మాధవిని కసిరాడు. తన ముందుకు పిలిచి కూచోమని, చదువు గురించి మామూలు ప్రశ్నలు వేశాడు. ముక్తసరి సమాధానాలిచ్చి కూచుంది మాధవి.

సురేశ్‌కి అసలే కోపం. దానికి తోడు కూతురి మౌన ప్రదర్శన. ఆమె ధోరణిలో నిర్లక్ష్యాన్నీ చదువుకొన్నాడాయన.

''ఏమెుచ్చింది నీకసలు? చేతులారా భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నావ్.ఏదో పోయేకాలం దాపురించింది" అని బాధనీ, కోపాన్నీ కలగలిపి వెళ్ళబోసుకున్నాడు. మాధవిమాత్రం బెల్లం కొట్టిన రాయిలా కూచుండిపోయింది.

❖ ❖ ❖

అంతకుముందు అసలేం జరిగిందో హేమలతని చెప్పనిద్దాం.

'సుప్రభాతం' మొదలెట్టింది మా అత్తగారు శాంతమ్మ.

నిష్ఠూరాలు, ఎత్తిపొడుపులూ, తప్పులెన్నటం - నాకు సంబంధించినంతవరకూ అది దుప్ప్రభాతమే. ఆమె అప్పుడు నాకు 'అ' శాంతమ్మే! ఇవాళ మాధవి మీదికి మళ్లింది గాలి!

'ఇంటర్ చదివే పిల్లవి. రోజూ చెప్పాలిటే? ఎంతసేపూ ఈ మొద్దునిద్ర? నీ వయస్సులో మేమెంత జెరపుగా వుండేవాళ్ళం.;? ఒక్క చేతిమీద ఇంటెడు చాకిరీ చేసుకొచ్చేవాళ్ళం. నిజానికి నీ వయస్సులోనేగా నాకు మీ అత్త పుట్టింది" ఆ ఘనకార్యానికి ఆమె మొహం మీద ఓ గర్వరేఖ! అక్కణ్ణుంచీ ఇక నలుగురు అసంతానం గురించీ, నలుగురు మొగ నలుసుల్ని గురించీ, వాళ్ళ పెంపకం, విద్యాబుద్ధులు, పెళ్ళిళ్లు... అన్నిటి గురించీ వరసగా దండ గుచ్చింది.

"మాధవీ -నువ్ లేమ్మా- ఇంక" అని సౌమ్యంగా అన్నాన్నేను. అప్పటికే స్టౌ మీదికి కుక్కరెక్కిస్తున్నాన్నేను.

మాధవి లేచి బాత్‌రూమ్‌లోకి దూరింది.

అది డ్రెస్ చేసుకుని తయారై బయటికొస్తూంటూనే, వాళ్ళ తాతయ్య అన్నారు "ఇవ్వాళేదో పరీక్షంటివిగా, ఓ అరగంట పుస్తకం చూసుకోరాదుటే?"

ఆయన వైపు అదోలా చూస్తూ, పుస్తకం పట్టుకుని సోఫాలో కూచుంది మాధవి. "లాస్ట్ వీక్ ఐఐటీ మోడల్ టెస్ట్ మార్కులు చెప్పారా?" సురేశ్ అడిగాడు. అప్పటికెప్పుడో ఆయన లాప్‌టాప్‌లో తలదూర్చే వున్నాడు. బిజినెస్ టార్గెట్‌ల వర్రీ ఆయనది. ఇన్సూరెన్స్ సేల్స్ మేనేజర్ ఉద్యోగం.

"ఇంకా చెప్పలేదు" మాధవి సమాధానం. "నిజమేనా?" ఆయన గద్దింపు. అది తలాడించింది. "ఆఁ చెప్పినా వచ్చేదేం వుందిలే మనకు?" అని, "అసలు కాలేజ్‌కి సరిగ్గా వెళ్ళేడిస్తే కదా?" అన్నారు చిరాగ్గా. "వెళ్ళకపోతే కొంపేం మునగదు. కిందటి వారం ఆ మెడల్‌టెస్ట్‌కి అరవైమందిగ్గాను ఇరవై ఆరుమంది వచ్చారు" మాధవి మాట పెళుసుగా వుంది.

"ఇప్పటికి నాలుగువారాల పేపర్లు దిద్దలేదు. మార్కులు చెప్పరు. కార్పొరేట్ కాలేజీ, పేరు గొప్ప. క్లాసు దిబ్బ"అని సోఫాలో మసిలింది. నేనూ దాన్ని గమనిస్తున్నాను. కిచెన్‌లో నుంచీ హాలు కనిపిస్తుంది నాకు. 'స్పెషల్ కోచింగంటూ స్మార్ట్‌లూ, టెక్‌లూ పేర్లు. అడిగితే 'చదువుకోండి.. చదువుకోండి' అని ఒక ఊతపదం. దానికి కలరేమో స్టడీ అవర్స్!"

మాధవి మాటలకి అస్తిమితంగా ఫీలయ్యాడు సురేశ్.

"ఆ మాత్రమన్నా, అక్కడ పుస్తకం చూస్తావనేగా - నలభైవేలు సమర్పించుకున్నాం"

"ఆ... అందుకే చదువుతూనే వున్నాం. ఏదడిగినా 'డౌట్స్ వుంటే లిస్టవుట్ చేయండి. చివర్లో కవర్ చేస్తాం' అని ఎప్పుడూ ఒకటే డైలాగు."

"దీనికసలు అందరి తప్పులూ ఎంచటం ఎక్కువైందిరా సురేశ్. ఎంత సేపటికీ - కాలికేస్తే వేలికీ, వేలికేస్తే కాలికీ. తల పొగరు" పూజ గదిలో గంట వాయిస్తూనే ఇటువైపు కొడుక్కోమాట అందించింది అత్తయ్య.

"అవునవును. ఆ మాటంటేనే దీనికీ వాళ్లమ్మకీ కూడా చేదు మాత్రలా వుంటుంది" సురేశ్, నన్నూ బరిలోకి లాగారాయన. "దానికా చదువఖర్లేదుట. మాన్పించండి. నా మీద ఒంటికాలితో లేస్తారేం?" అన్నాన్నేను. ఆయన కారాలూ మిరియాలూ నూరుతూ పళ్ళు పటపటలాడించారు. "అవును.. మానిపిస్తా, నువ్వు ఇంకాస్త ముద్దు చేసి, 'అమ్మా- తల్లీ' అంటూ పక్కలో పడుకోబెట్టుకో" అని కొరకొరా నా వైపు చూశారు.

నాకు మనసంతా కలచినట్లైంది. ఆయన ఎత్తి పొడుపుకు దుఃఖం పొంగుకొచ్చింది. ఆనాటి సంఘటనా కళ్ళముందు మెదిలింది.

మాధవికి సాధారణ జ్వరంగా మొదలైన అనారోగ్యం చికెన్‌పాక్స్‌లోకి దించింది. వారమైనా తగ్గలేదు. ఈలోగా కాలేజీ వారి ఫోన్లు. చదువు పోతున్నదని

సురేశ్ రుసరుసలు. 'మునుపే ముక్కిడి వెనక తక్కిడి' అని సామెతల్తో సహా అత్తయ్య సతాయింపు. మామగారి అవాంఛిత పరామర్శలూ. పట్టుబట్టి మా అత్తయ్య వో గురవారం నాడు స్నానం చేయించేసింది. మాధవికి ప్రాణం అతలాకుతలమైపోయింది. వాతం కమ్మిందన్నారు. మళ్ళీ జ్వరం. టైఫాయిడ్‌లోకి దించింది. అదిగో అప్పుడూ – నేను మాధవి పక్కలో పడుకుని., దాన్ని ఊరడిస్తూ , ఉపశమనం పలుకులు పలుకుతూ గడిపింది. ఆ తర్వాత పదిహేను రోజులక్కానీ మాధవి తేరుకోలేదు.

ఆయన నా మీదికి విసురుతున్న రాయికి ఇదీ అసలు కారణం.

అసలే సాఫీగా లేని మాధవి చదువుని ఈ దెబ్బ బాగానే ఆటంక పరిచింది.

కళ్ళనీళ్ళు తిరిగినై నాకు. పైట కొంగుతో కళ్ళొత్తుకున్నాను.

ఇంతలో అత్తయ్యేమో 'కూతురు చెడుగైన మాత తప్పు" అంటూ కుమారీ శతకాన్ని అందుకుంది. అటు వైపు మావగారేమో "అసలు ప్రాబ్లెమ్– ఆ ఫేస్‌బుక్ రా సురేశ్. అదెందుకే తల్లీ అంటే నేను దానికి శత్రువునై పోతున్నాను" అంటూ ఈ మాటల బరిలోకొచ్చారు.

నేను మాధవి వైపు చూశాను. దాని కనుకొలకుల్లో రెండు కన్నీటి బొట్లు. ఆ బిందువుల్లో – మా అందరి పట్లా ఏవగింపూ, అసహ్యమూ. 'ఛ' అనుకుంటూ ఠక్కున లేచి, చేతిలో పుస్తకాన్ని వో మూలకు విసిరి, కాళ్ళు తటపటాయిస్తూ అక్కణ్ణుంచీ తన గదిలోకి వెళ్ళి పోయింది.

ఇంట్లో అహరహమూ ఇట్టా ఉరుములూ, మెరుపులే. దాని పద్ధతి మారుతోందంటూ ఎవరో ఒకరు సతాయించటమే. నేను సర్ది చెప్పబోతే, నాకూ నాలుగు వడ్డింపులు!

ఆ వేళ – ఆదివారం. చందానగర్ నుంచీ రమణా, రజనీ వచ్చారు. నా మరిదీ, తోడికోడలూ. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ వాళ్ళు. మేముండేది వనస్థలిపురం. వారం వారం వచ్చి చూసి పోతూ ఉంటారు.

హాల్లో కూచుని కాఫీలు తాగుతున్నాం. ఉబుసుపోక కబుర్ల మధ్య కాఫీలయినై.

"ఏం మాధవీ చదువెట్టా వుంది?" అని యధాలాపంగా అడిగింది రమణి. మౌన లిపిలో కళ్ళూ తలా ఆడించింది మాధవి. అప్పుడు సురేశ్ అందుకున్నాడు.

తమ్ముడివైపు చూస్తూ "కిందటివారం కాలేజీకి నన్ను పిలిపించారు. మన బంగారం విశేషాలు చెప్పటానికి. ఈ మహారాణీ ఘనతని చెప్పి 'అటెండెన్సూ ఇర్రెగ్యులర్, చదువూ ప్రోగ్రెస్ బాగాలేదు. జాగ్రత్తగా మానిటర్ చేసుకో' మని హెచ్చరిక చేశారు. అని వో క్షణం ఆగి, "అప్పుడీమె గారు 'అట్టాగైతే - ఫీజ్ వాపస్ చెయ్యండి నా చదువు నేను చదువుకుంటా' నన్నది. నాకు తల కొట్టేసి నట్టైంది. "దీని తల పొగరుతో ఛస్తున్నాం."

"అదేవిటీ?" అంటూ ఆశ్చర్యపోయారు రమణా, రజనీ. సురేశ్ కళ్ళల్లో ఎర్రజీరని నేను గమనించగలిగాను.

కొంతసేపయింది. "మాధవికేం చెప్పాలన్నా కష్టమే, దానికి ఆత్మాభిమానం ఎక్కువ" అని నవ్వాడు రమణ. "క్రితం సారి వచ్చినప్పుడు నాన్న చెప్పారు గదా- ఇంట్లో ఉన్నంతసేపూ టీవీలో ఆటా పాటా గేమ్, తిక్కడాన్సులూ, సినిమాలు, సీరియళ్ళే. కాదంటే కంప్యూటర్లో తల దూరుస్తుంది. ఛాటింగ్సూ, మెయిల్సూ, ఫేస్‌బుక్‌లూ లేదా యూ ట్యూబూ. అవునా మాధవీ?"

అదేమీ మాట్లాడలేదు. "అంతేకాదు. పొరపాటున దానికి దగ్గరగా మనం నడుస్తున్నామా, వెంటనే సైట్‌ని మార్చేస్తుంది. ఇంకా ఏమన్నా అంటే, గదిలోకి పోయి ఏ 'ఛేజ్' బుక్కో పట్టుకుని పడుకుంటుంది" అంటూ వివరాలందించాడు మావయ్యగారు!

"అయినా మేం చెప్పేవేమన్నా పనికిరాని విషయాలుట్రా- నువ్ చెప్పు. దాని మంచికే గదా" అంటూ అత్తయ్య మాట కలిపింది.

ఇంకా కొంత సంభాషణ ఈ ధోరణిలోనే సాగింది.

మాధవి మనస్సులోని కల్లోలాన్ని అర్థం చేసుకోగలను. లేచి వెళ్ళి, టిఫిన్ ప్రయత్నం మొదలెట్టూ, మాధవిని కిచెన్‌లోకి పిలిచాను- ఆ సందర్భాన్ని మారుద్దామని. వచ్చింది. ఆమె వెనగ్గా రజనీ వచ్చింది.

రజని కూడా మాధవి చదువు ప్రసక్తినే తెచ్చింది.

మాధవి విసుక్కుంది. చిరాకు పడింది. "నాకీ కోచింగే వద్దు. నేను హాయిగా ఇంటర్ కాగానే బియ్యేలో చేరతాను. తర్వాత తెలుగులో ఎమ్మేచేసుకుంటాను"

సురేశ్‌కి ఈ మాట వినపడింది. "అప్పుడు గానీ బొచ్చె చేతికి రాదు. గవర్నమెంటుకి ఎక్కువ, ప్రైవేటుకి తక్కువా అయిపోతావు" అని గొంతెత్తి మరీ

అరిచి, "అట్టా తెలుగనీ, ఇంగ్లీషుని ఏడ్చి గదా. ఇదిగో ఇట్టా ప్రైవేట్ కంపెనీలో గొడ్డు చాకిరీ చేస్తున్నాను" అని వాపోయాడు. ఆ తర్వాత చాలా సేపు తన 'ఖర్మ'ని తాను నిందించుకున్నాడు.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు కూరుకుపోయారు.

మాధవి మనసులో హోరు నాకు తెలుస్తూనే ఉంది.

మొత్తానికి దానికి చదువో గుదిబండగా మారిందనేది మాత్రం వాస్తవం. మా అందరి మాటల దెబ్బలకి అది చాలా భీకరంగా మారింది. ఆ భీకరత్వంలో చెప్పలేని దైన్యము వుంది!

రాత్రి భోజనాల దగ్గర మా రమణ కూడా మాధవి గురించి మాట్లాడాడు. 'నేను కూడా హితబోధ చేస్తున్నాననుకోకు" అంటూనే "నిన్నివ్వాళ ఆకర్షిస్తున్న ఏ అంశమైనా సరే – జీవితంలో ఏ స్టేజ్‌లోనైనా ఎంచక్కా ఎంజాయ్ చెయ్యగలవు. కానీ, చదువు విషయం అట్టా కాదు. ఈ సమయంలో ఇప్పుడే చదువు కోవాలి. ఆలోచించు. నీ భవిష్యత్తు నీ చేతుల్లోనే వుండేది" అని చెప్పాడు.

మాధవి వింటూ కూర్చుంది.

రెణ్ణెల్లు గడిచాయి.

క్రమేపీ మాధవి మానసిక పరిస్థితి శారీరకమైన దర్బలత్వంగా మారింది. ఆమె ఆరోగ్యం రోజురోజుకీ దిగజారసాగింది. ఆ పాటికి కొంగ మెడపడి, నవసిపోస్తున్నట్టయింది. గుమ్మటంలా, ఎదిగిన నందివర్ధనం చెట్టులా వుండే పిల్ల కాస్తా, ఎండిన తోటకూర కాడలా జావగారి పోతోంది. రాత్రులకి రాత్రులు మాధవికి నిద్రలేదు; నాకు నిద్రరాదు. మధ్యలో వాళ్ల నాన్న రుసరుసలు!

ఆ వేళ –రాత్రి ఎనిమిదవుతోంది. ఆకాశం మబ్బులు కమ్మింది. గాలి రొద పెడుతోంది. ఏ క్షణాన్నైనా వాన రావచ్చు.

కాలేజీ నుంచీ మధ్యాహ్నమే వచ్చేసిన మాధవి అసలు తన గది నుంచీ బయటకే రాలేదు. నిద్రపోతోంది కాబోలనుకున్నాను. "మాధవి తిండీ తిప్పలు లేకుండా అట్టాగే పడుకుందేమో. దాన్ని పిలు" అన్నది అత్తయ్య. పైకి ఏమి అరిచినా, సతాయించినా ఆమెకి మనవరాలంటే ప్రాణం. నాకు తెలుసు!

నేను మాధవి గదిలోకి వెళ్ళాను. మంచం మీద బోర్లా పడుకుని వుంది. పిల్చాను. ఉలుకూ పలుకూ లేదు. ఎందుకో గుండె గుబగుబలాడింది. దగ్గరగా వెళ్ళాను. 'మాధవీ' గట్టిగానే పిల్చాను. కదల్లేదు పిల్ల. ఎక్కడో ఉరిమింది. ఉలికిపాటుతో మాధవిని పిలుస్తూ చేత్తో తట్టాను. అది పక్కకి దొర్లింది. 'ఊం' అని దీర్ఘం తీసింది. మాటా తేలిపోతోంది. తత్తఅపాటుతో పరీక్షగా చూశాను. దాని కళ్ళూ నిలువు గుడ్లు పడుతున్నై. గుండె గుభిల్లుమంది. "ఏవండీ - త్వరగా రండి" అంటూ పెద్దగా అరిచేశాను.

❖ ❖ ❖

మాధవి నిద్రమాత్రలు మింగింది. సరైన సమయంలో గమనించటం వలన గండం గడిచింది. ఆమె ఆత్మహత్యా యత్నం ఎందుకు చేసిందో ఇదమిత్థంగా ఎవరికీ తెలీలేదు. ఇంట్లోని వారంతా నోళ్ళు కుట్టేసుకుని, ఆ సంఘటనని 'జీర్ణం జీర్ణం....' గా మింగేశారు.

మాధవి కళ్ళల్లోని లోతుల్ని మాత్రం ఎవ్వరూ వెతకబోలేదు. ఆమెకి తెలీకుండా - ఒకర్నొకరు మాత్రం 'మీరు పొరపాటు చేశారంటే మీరే పొరపాటు చేశా'రంటూ తప్పులెన్నుకున్నారు.

శాంతమ్మ మాత్రం ఎందుకనో మూగశ్రోతగా నిలబడిపోయింది.

పదిహేను రోజులు గడిచాయి. మాధవి మళ్ళీ కాలేజీకి వెళ్ళలేదు. రమణ, రజని వచ్చి కొంత గాలి మార్పిడిలా ఉంటుందని మాధవిని చందానగర్ తీసి కెళ్ళారు. రజనీ వో వారం సెలవు పెట్టింది.

ఓరోజున - దిగాలుగా అన్యమనస్కంగా కూర్చునుంది హేమలత. ఊహలు గొలుసులు తెంచుకుని పరిగెత్తుతుండగా చప్పున వో ఆలోచన స్ఫురించిందామెకు. మానస గుర్తుకొచ్చింది.

మానస మాధవి స్నేహితురాలు. ఇద్దరికీ దోస్తీ జాస్తి. ఒకటి రెండుసార్లు ఇంటికీ వచ్చింది. ఆమెకి ఫోన్ చేసింది. మానస ఇంట్లోనే ఉంది.

వెంటనే బయల్దేరి మానస వాళ్ళింటికి వెళ్ళింది హేమలత. ఆమె తల్లిదండ్రులూ ఇంట్లోనే వున్నారు. కాఫీలయినై. కాలేజీ సంగతులూ,చదువు విషయాలే కదిల్చింది హేమలత. అప్పుడు చెప్పింది మానస. "మాధవి చాలా సెన్సిటివ్ ఆంటీ. నా బాధ్యత నాకు తెలుసుకదా- అనే తత్త్వం దానిది. ఇతరులు

తన లోపాల్ని ఎంచితే భరించలేదు. పైగా స్వయం పాకం మనిషి" అని ఆలోచనలో కొంతసేపు గడిపి, తటపటాయిస్తూ చెప్పింది. "నీకో ముఖ్యమైన సంగతి చెప్పాలి. ఆ సంఘటన తనని బాగా అప్‌సెట్ చేసింది. మీకు తెలుసో తెలియదో?" తెలీదు చెప్పమంది హేమలత.

"ఆవేళ మాధవి ఫస్టవర్‌కి పావుగంట లేటుగా వచ్చింది. ఆ క్లాస్ పురుషోత్తం సార్‌ది. ఆయన పంక్చువాలిటీలో చాలా స్ట్రిక్ట్. ఆమెని చూడగానే "ఓహో, మాధవీదేవీగారా? దయచేయండి. ధూపదీప నైవేద్యాలన్నీ అయినయ్యా?"అని వెటకారంగా మాట్లాడి, దాన్నేమీ చెప్పనీయకుండా – 'వెళ్ళి క్లాస్ చివర గోడవారగా నిలబడ'మన్నాడు. మాధవితో పాటు మేమూ లోలోపల ఉడికిపోయాం. కానీ, ఆ సార్‌కి అది అలవాటే. మాలో చాలామందిమి ఆ శిక్షకు గురయిన వాళ్ళమే, సిగ్గుతో సగం చచ్చిపోయి గోడ దగ్గర నిలబడింది మాధవి. క్లాస్ అయిన తర్వాత బాయ్స్ అంతా కిచకిచలూ, వెర్రిమొర్రి ధ్వనులూ! బయటికొచ్చాం. నేను దాన్ని తిట్టేశాను. 'లేటయితే అసలు ఆయన గారి క్లాస్‌కి రాకూడదని కదా మనమనుకున్నది. ఎందుకొచ్చావ్? బుద్ధిలేదు' అని విసుక్కున్నాను. అది మూగగా ఏడ్చేసింది. వెంటనే దిగులుగా ఇంటికెళ్ళిపోయింది. అంతే. ఆ తర్వాత మాధవి కాలేజీకి రాలేదు' ఇదీ సంఘటన! సున్నితమైన గాజు పాత్ర నేలమీద పడి ముక్కలు ముక్కలయిందన్నమాట!

గుడ్ల నీరు కక్కుకుని సెలవు తీసుకుని వచ్చేసింది హేమలత. 'ఎక్కడికి వెళ్ళావ్. ఎందుకలా వున్నావ్. లతా' అని శాంతమ్మ ఎంతగా అడిగినా ఏమీ చెప్పలేకపోయింది.

రాత్రి ఏడున్నరైంది. రజనికి ఫోన్ చేసింది హేమలత.

కడుపులో మాట చెప్పుకుని బావురుమన్నది. మానస చెప్పిన సంఘటనని వివరంగానే చెప్పింది. దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో "ఏమైనా చెయ్యాలి రజనీ, పిల్లని మనషుల్లో పడేయాలి" అని ప్రాధేయపడింది.

పక్కకి తిరిగి చూస్తే – అక్కడ శాంతమ్మ! ఆమె నిమ్మళంగా కోడలి దగ్గరకొచ్చి, భుజం మీద చెయ్యి వేసి అనునయంగా "పిచ్చి పిల్ల! ఇంతగా బెంబేలు పడితే ఎట్లా?" అన్నది. హేమలత నిబ్బరించుకోలేక పోయింది. పెదవులు వణికినై. 'అత్తయ్యా' అంటూ ఏడ్చేసింది. చూపుల్లో ధైర్యం పలికింది శాంతమ్మ.

మర్నాడు – మాధవిని తీసుకుని వనస్థలిపురం వచ్చింది రజని. హేమలతా, రజనీ కాలేజీకి వెళ్ళారు. వైస్ ప్రిన్సిపాల్ సుందరితో ఈ విషయాలన్నీ మాట్లాడారు. ఆమె తనకీ సంగతులేవీ తెలియవే అని ఆశ్చర్యాన్ని ప్రకటించింది. రజని కొంచెం గొంతెత్తి కఠినంగా మీడియాకు వెళ్తమనీ, ప్రభుత్వానికీ ఫిర్యాదు చేస్తామనీ చెబుతుంటే, సుందరి వీళ్లని ప్రిన్సిపాల్ దగ్గరకి తీసుకుపోయింది. ఆయన తానీ పరిస్థితిని సరి చేస్తాననీ, మాధవి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాననీ 'ప్రామిస్' చేశాడు. మాటల్లో మాటగా మాధవి సహజంగా తెలివిగల స్టూడెంట్ అనీ, టెన్త్ వరకూ చాలా 'బ్రైట్' అనీ వివరించింది రజని. మాధవి కోచింగ్ బాధ్యత తనది అని హామీనిచ్చాడాయన.

సంతృప్తిగా ఇంటికి తిరిగొచ్చారు – హేమలతా, రజనీ. ఈ విషయాలన్నీ నిదానంగా – ఇంట్లో అందరికీ తెలిశాయి. ఎవరికి తోచిన సలహా వారు ఇస్తున్నారు మాధవికి. కానీ, ఆమెలో పెద్దగా మార్పేమీ రాలేదు. హేమలత దిగులుగానే వుంది. శాంతమ్మబాధ బాధగానే ఉంది. పిల్లని డాక్టర్‌కి చూపించారు 'డిప్రెషన్' అని మందులు రాసిచ్చారు. 'ఇవీ నిద్రమాత్రలే' అని పక్కన పడేసింది. ఎవ్వరూ ఆమెని నొప్పించకుండా మసులుకుంటున్నారు. మాధవిని సాధ్యమైనంత వరకూ ఒంటరిగా గదిలో కూచోనీయడంలేదు హేమలత.

ఆరోజు భోగి పండుగ

కొత్తబట్టలు కొనటానికి షాపింగ్‌కి పోదామనుకున్నారు అత్తాకోడళ్ళు. మాధవిని రమ్మంటే ఆమె నిరాసక్తంగా రానన్నది.

పిల్ల నిరుత్సాహం చూసి వీళ్ళు మొహమొహాలు చూసుకున్నారు. 'మేమూ వెళ్ళములేవే" అన్నది హేమలత.

కూచుని కబుర్లాడుకుంటున్నారు. ఆ తర్వాత కొద్దిసేపు ముగ్గురూ కలిసి కేరమ్స్ ఆడారు. ఈ కాలక్షేపం మాధవిని పెద్దగా ఉత్సాహ పరచలేదు. ఏదో పుస్తకం పట్టుకుంది.

రాత్రి భోజనాలైనాయి. అందరూ హాల్లోనే వున్నారు. అప్పుడు చెప్పటం మొదలెట్టింది శాంతమ్మ. "ఈ కార్పొరేట్ కాలేజీల్లో చదువు – మార్కుల రొదకీ, ర్యాంకుల సొదకీ పరిమితమై పోతోందిరా సురేశ్. ప్రతికూల సంభవాల్నీ ఓటమినీ ఎదుర్కొనే శక్తినీ, ఆత్మస్థైర్యాన్నీ ఇవ్వటం లేదు. చదువు పేరుతో బహుశా మనం

కూడా పిల్లల మానసిక, శారీరక విధ్వంసానికి తప్ప వికాసానికి శ్రద్ధ తీసుకోవటం లేదేమో. ఒక్క మాట చెబుతాను. ఆలోచించండి” అని క్షణం సేపు ఆగింది.

నలుగురి వైపూ పరీక్షగా చూస్తూ కొనసాగించింది. “మాధవిని ఆ కాలేజ్ నుంచి బయటపడెయ్యండి. టీసీ తీసుకొని వేరే ఏదన్నా మామూలు కాలేజీలో చేర్పించరా సురేశ్. దానికి కావలసిన చదువేదో దాన్ని చదువుకోనీ. తెలుగు ఎమ్మే చేస్తానంటోంది కదా – చెయ్యనియ్. అంతా మంచే జరుగుతుందని ఆశిద్దాం. అందరూ అంతరించిపోతుందని ఘోష పెడుతున్న తెలుగుభాష భవిష్యత్తుని మాధవి లాంటి వాళ్ళు భద్రం చేస్తారేమో చూద్దాం. వీటన్నింటికి మించి చదువే జీవితం కాదు గదా. ముందా పిల్ల ఆరోగ్యంగా వుంటే చాలు. ఈ వయస్సులో దాని మనసుని అలజడి పాలు చెయ్యద్దురా...” అప్పటికే ఆమె కళ్ళు సజలాలయ్యాయి. మాట గద్గదికమైంది.

సురేశ్ తండ్రి వైపు చూశాడు. ఆయన భార్యనీ చూస్తున్నాడు! హేమలతకి ఈ మాటలు ఆర్ద్రంగా తగిలాయి. ప్రశాంతంగా అనిపించాయి. అందరూ కలిసి మాధవిని చూశారు. ఆమె కళ్ళు కొత్త మెరుపుతో మిలమిలలాడాయి.

మాధవి స్వభావతహా మంచి పిల్ల!!

రేపు సంక్రాంతి.

**(నవ్య, ఏప్రిల్ 18, 2012)**

(కర్రి సీతారామయ్య స్మృతి సాహితి – నవ్య వీక్లీ ఉగాది కథల పోటీలో విశేష బహుమతి పొందిన కథ)